# అధికారి

అతడో పెద్ద అధికారి.

దేశంలో శాంతిభద్రతల్ని కాపాడటం అతని బాధ్యత అనీ, ఆయన ప్రజలకు సేవకుడని యేలినవారు చెబుతుంటారు.

కానీ ఆ అధికారికి మాత్రం తన బాధ్యత ఎప్పుడూ గుర్తురాదు. తనో పెద్ద అధికారిననీ, ప్రజల మీద అధికారం చెలాయించడం కోసమే తనను యేలినవారు నియమించారని అతడనుకుంటాడు.

అతనిది చాలా పెద్ద విగ్రహం.

ఎర్రగా కమిలిన ముఖం... అతని కళ్ళు కూడా ఎప్పుడూ ఎర్రగానే ఉంటాయి. గుబురు మీసాలతో అతని ముఖం చాలా భయంకరంగా కనిపిస్తూ ఉంటుంది.

అతని చేతిలో ఎప్పుడూ ఒక లాఠీ ఉంటుంది.

ఆ లాఠీని ఎప్పుడూ అటూ ఇటూ తిప్పుతూ అతని అధికారమంతా ఆ లాఠీలోనే ఉందన్నట్టుగా కనిపిస్తాడు. ఎంత గుండె నిబ్బరమున్న మనిషైనా అతన్ని మొదటిసారి చూసినప్పుడు కంగుతింటారు.

అతడు రోజూ రాజుగారు వేసుకొనే చాలా ఖరీదైన దుస్తుల్ని ధరించి, ఏలినవారిచ్చిన భారీ వాహనంలో 'రాజు వెడలె రవితేజములలరగ' అనిపించేటట్టుగా తన సామ్రాజ్యంలో ప్రవేశిస్తాడు. అతడు నములుతున్న జర్దాపాన్ వాసన అతని సామ్రాజ్యమంతా వ్యాపిస్తుంది. కొందరికైతే ఆ వాసన వల్ల తల గిర్రున తిరుగుతున్నట్ట నిపిస్తుంది.

అతడు తన సామ్రాజ్యంలో ప్రవేశించగానే అక్కడున్న అతని భటులంతా అటెన్షన్‌లో నిల్చొని అతనికి గొప్ప భక్తి ప్రపత్తులతో సెల్యూట్ చేస్తారు. వాళ్ళ సెల్యూట్‌ని అతడు పట్టించుకోకుండానే ఏనుగు నడిచినట్టుగా నడుస్తూ తన కోసం ప్రత్యేకంగా నిర్మించబడిన ఎయిర్ కండీషన్డ్ గదిలో ప్రవేశించి అక్కడున్న తన సింహాసనం మీద ఆసీనుడౌతాడు. అతని ముందు చిన్న చిన్న సింహాసనాలు చాలా ఉంటాయి. అధికారి వచ్చి తన సింహాసనం మీద కూర్చోగానే ఖాళీగా వున్న ఆ చిన్న సింహాసనాల మీద ఐదారుగురు అతని వందిమాగదులొచ్చి కూర్చుంటారు.

"ఈరోజు మీరు ధరించిన దుస్తులు అద్భుతంగా ఉన్నాయ"ని ఒక వందిమాగదుడంటే

"నిన్నటి కేసులో మీరిచ్చిన తీర్పు పూర్వం మర్యాదరామన్న ఇచ్చిన తీర్పుల కంటే గొప్పదిగా ఉంద"ని మరో వందిమాగదుడంటాడు.

అధికారి వాళ్ళందరివేపు 'భేష్' అన్నట్టుగా చూస్తూ గలగలా గుబురు మీసాల్లోంచి నవ్వుతాడు.

అతడొచ్చి సింహాసనం మీద కూర్చోగానే రిమోట్ కంట్రోల్‌తో గోడకు అమర్చబడిన బిగ్ టీవీని వెలిగిస్తాడు. దాంట్లో భారతదేశానికి, పాకిస్తాన్‌కు మధ్యన జరుగుతున్న క్రికెట్‌మ్యాచ్ ప్రత్యక్షప్రసారం వస్తూంటుంది.

"ఈరోజు మన సచిన్ టెండూల్కర్ సెంచరీ చేసి పారేస్తాడు. మనం గెలుస్తం" అంటాడు అధికారి.

"అయ్యోసార్! మీకు తెలీదా... సచిన్ ఇంతకు ముందే అవుటయ్యిండు" అంటాడు వందిమాగదుల్లో ఒకడైన లింగం.

"ఈజిట్? చాలా బ్యాడ్ న్యూస్ కన్వేచేసినావు లింగం! నేను ఇంటి నుండి వచ్చేటప్పుడు సచిన్ చాలా బాగా ఆడుతున్నాడే..."

"అవును సార్... కానీ అప్పుడే ఆఫ్రీది వేసిన బంతి ఎల్.బి.డబ్ల్యు. అయ్యాడని ఎంపైర్ ఫింగర్ లేపాడు సార్... సచిన్‌కు చాలా అన్యాయం జరిగింది సార్. బంతి బ్యాట్‌కు తగిలాకే ప్యాడ్‌కు తగిలింది. బ్యాట్‌తోనే అడానని సచిన్ ఎంపైర్‌కు బ్యాట్ చూపించినా ఔట్ చేసిండు" అంటాడు లింగం.

"సచిన్‌కు ఎప్పుడూ ఇలాగే జరుగుతుంటుంది. ఛీ ఛీ! నా మూడంతా పాడైపోయింది" అంటాడు అధికారి టీ.వీ. వైపే చూస్తూ.

"ఇప్పటికీ మనకు గెల్చే ఛాన్సుంది సార్! 'ద్రవిడ్ – ది'వాల్' చాలా బాగా ఆడుతున్నాడు" అంటాడు మరో వందిమాగదుడు – అతని పేరు జగన్.

"ద్రవిడ్ బాగానే ఆడాడు. కాని అతడు ఫినిషింగ్ చెయ్యడు. ఆడి ఆడి సడెన్‌గా ఔటైపోతాడు... జరిగితే అది సచిన్ కారణంగానే జరుగుతుంది... ఏమంటావు జగన్!" అంటాడు అధికారి.

"నిజమే సార్... మీరన్నది కరెక్ట్‌సార్! సచిన్ లేకపోతే ఇండియన్ టీమే లేదు" అంటాడు జగన్.

ఇంతలో అధికారి ముందున్న మొబైల్ మోగుతుంది.

"హల్లో సుధాకర్ ! ఇప్పుడే సచిన్ అవుటయ్యాడు. నేను చాలా బ్యాడ్‌మూడ్‌లో ఉన్నాను. నీతో మాట్లాడలేను. ఫోన్ పెట్టేయ్" అంటాడు అధికారి.

"ఉండండుండండి ఫోన్ పెట్టెయ్యకండి. మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి!" అంటారు సుధాకర్.

"ముఖ్యమైన విషయం మాట్లాడే మూడ్ లేదని చెప్పానా? ఫోన్ పెట్టేయ్" అంటూ మొబైల్‌ని తన ముందున్న టేబుల్ మీదకు విసిరేస్తాడు.

మొబైల్ మళ్ళీ మోగుతుంది. దాన్ని అందుకున్న అధికారి "ఫోన్ పెట్టయ్యమని చెప్పానా? వినిపించలేదా?" గర్జించినట్టుగా అరుస్తాడు అధికారి.

"నిన్న మీకో కేసు గురించి చెప్పాను" అంటాడు సుధాకర్.

"యేం కేసు! ఆ మొగుడు పెళ్ళాల కేసేనా?"

"అవును సార్! పాపం మొగుడు... వాని పేరు హనుమంతు... హనుమంతుణ్ణి బంధించారట"

"రోజూ పీకలదాకా తాగొచ్చి పెళ్ళాన్ని కొడ్తుంటే బంధించక ముద్దుపెట్టు కొమ్మంటావా?"

"వాడసలు తాగనే తాగడు సార్. అదే వాన్నికొడ్తుంది. దానికి ఇంకోడితో సంబంధం ఉంది... అది దాని మొగుడికి తెలిసిపోయిందని వాన్ని బ్లాక్‌మెయిల్ చెయ్యడం కోసం వాని మీద కంప్లెయింటిచ్చింది.

హనుమంతు గాడొట్టి సత్తెకాలపు మనిషి. వాడిని వదిలిపెట్టండ్రి సార్. నేను జడ్.పి.టి.సి ఎలక్షన్స్‌తోటి బిజీగున్న. నా క్యాండిడేట్‌ని గెలిపించుకోకపోతే పార్టీలో నా పరువుపోతది. హనుమంతుగాడు నాకు రైట్‌హ్యాండ్ లాంటి వాడు. ఎక్కడికి పొమ్మంటే అక్కడికి పోతడు"

"నీ క్యాండిడేట్ గెలవకపోవడమేమిటి? ఓ రెండు కోట్లు కుమ్మరిస్తే నీ క్యాండిడేట్ చచ్చినట్లు గెలుస్తాడు. రెండు కోట్లు నీకోలెక్కా?" అంటాడు అధికారి.

"అది సరేగాని హనుమంతును వదిలెయ్. మిగతా విషయాలు నేనొచ్చిన తర్వాత మాట్లాడుకుందాం"

"నువ్వు చెప్పినంక వదిలెయ్యనా? నువ్వొచ్చి కలుస్తనంటున్నవు... ఎప్పుడు కలుస్తవు?"

"నీరుణం ఉంచుకోను... వీలైతే ఇప్పుడేవస్త వాన్నైతే వదిలెయ్"

అతడు ఫోన్ పెట్టయ్యగానే ద్రవిడ్ ఔటవుతాడు. "నేను చెప్పానా? ద్రవిడ్ ఆడి ఆడి, డిఫెండ్ చేసి చేసి చివరకో పిచ్చి బాల్‌కు అవుటవుతాడని... ఛీ ఛీ! మూడ్ మల్ల పాడైంది" అంటాడు అధికారి.

అధికారి కూర్చున్న గది బయట చాలామంది స్త్రీలు, పురుషులు నిల్చొని అధికారి ఎప్పుడు పిలుస్తాడా అని ఎదురు చూస్తుంటారు. వాళ్లల్లో కొందరు స్త్రీలు తలలు బాదుకుంటూ పెద్దగా యేడుస్తారు. "నోర్మూయ్యండం"టూ అక్కడున్న భటులు వాళ్ళను కోప్పడుతుంటారు. వాళ్లల్లో ఎక్కువ మంది మొగుడు పెళ్ళాల కోట్లాటలకు సంబంధించినవాళ్ళే ఉంటారు. కాస్సేపు మొబైల్‌లో మాట్లాడుతూ టీ.వీలో క్రికెట్ మ్యాచ్ చూస్తూ, కాస్సేపు తన ముందు కూర్చున్న వందిమాగదులతో మాట్లాడుతూ గడుపుతున్న అధికారికి బయట అతని పిలుపుకోసం ఎదురుచూస్తూ నిల్చున్న వాళ్ళ యేడుపులు వినిపంచవు.

అధికారి యేమూడులో ఉన్నాడో గమనిస్తున్న ఓ భటుడొచ్చి

"మిమ్మల్ని నిన్న మీ దగ్గరకొచ్చి మొగని మీద కంప్లైయింటిచ్చినామె కలుస్తదట సార్! పంపించమంటారా?" అంటాడు.

"యేది... టీ.బీ. పేషెంట్‌లా సన్నగా ఉంటుంది. అదేనా?" అంటాడు అధికారి.

"అవును సార్"

"పంపించు"

టీ.బీ. పేషెంట్‌లా ఉన్న ముప్పయేళ్ళ స్త్రీ లోపలకొస్తుంది. వందిమాగదులందరూ ఆమెవైపు చూస్తారు.

"యేం సంగతి అంజమ్మా!" అంటాడు అధికారి.

"యేం సంగతి లేదు సార్! నిన్న మా ఆయన మీదిచ్చిన కాగితాన్ని వాపసు తీసుకుంటగని మా ఆయన్ను విడుదల చెయ్యండ్రని చెప్పడానికొచ్చిన"

"వాపసు తీసుకుంటావా? నీ బుర్రలో మెదడుందా? పెండుందా? యేమనుకుంటున్నావు నువ్వు? మొగుడు రోజూ తాగొచ్చి కొడ్తాండని కంప్లైంటిస్తవు. మేం వాన్ని తీసుకొచ్చి బొక్కలో పడేసినంక వాపసు తీసుకుంటానంటవా? ఇదేం నీ తాత జాగీరనుకుంటున్నావా? ఫాల్స్ కంప్లైంటిచ్చినందుకు వాన్ని వదిలేసి నిన్ను లోపల పడేస్త... యేమనుకుంటున్నావో..."

"మీ కాల్మొక్త సారూ! వాడు నిన్న ఓ పిచ్చికూత కూస్తే కడుపు మసిలింది. ఆ కోపంతోటేగా కాగితం రాపిచ్చి ఇచ్చిన. వాడు తాగినప్పుడు పిచ్చి పిచ్చి మాటలంటడు గని తాగనప్పుడు మంచిగనే ఉంటడు సారూ!"

"వాడసలు తాగనే తాగడని మాకు ఎంక్వయిరీలో తెలిసింది. వాడు నిన్ను కొట్టుడు గాదు - నువ్వే వాన్ని కొడ్తవని కూడా తెలిసింది. మొగన్ని కొట్టి మొగసాల

కెక్కడమంటే ఇదే కావచ్చు!" అని అధికారి అనగానే అక్కడ కూర్చున్న వందిమాగదులంతా పకా పకా నవ్వుతారు.

"వాడు రోజు తాగడుగని అప్పుడప్పుడు తాగుతడు సారూ! తాగితే వాడు మనిషి కాడు"

"వాడు రోజూ తాగొచ్చి కొడ్తడని ఇదివరకు రాసిచ్చినవు. ఇప్పుడేమో అప్పుడప్పుడు తాగుతడంటున్నవు. అబద్ధం చెప్పినందుకు నిన్నిప్పుడే లోపలేస్తున్న... అరేయ్! చంద్రయ్యా! దీన్ని తీస్కపోయి..."

"వద్దు సారో మీ కాల్మొక్తసారో... గా వకీలు గట్ల రాయమంటే రాసిచ్చిన సారో... నన్ను లోపలేయకుండ్రి సారో..." అంటూ ఆమె లబోదిబోమంటూ తలబాదుకుంటుంది.

"యేయ్ బక్కదానా! ఇక్కడ పెద్ద సీన్ చెయ్యకు. బయటకు నడువు..." అంటాడు అధికారి.

అధికారి దృష్టి టీవీమీదకు మళ్ళుతుంది.

"అరే... లక్ష్మన్ కూడా అవుటయ్యిండు! వెరీ వెరీ బ్యాడ్!" అంటాడు అధికారి బోల్డు బాధపడిపోతున్నట్లుగా నటిస్తూ...

అంజమ్మ "నన్ను లోపలెయ్యొద్దు దొరో! నీ కాల్మొక్తదొరో!" అంటూ పెద్దపెట్టున యేడుస్తుంది.

"యేమే అంజమ్మా! నాతోటి కాసేపు బయటకురా!" అంటాడు వందిమాగదుల్లో ఒకడైన లింగం.

అంజమ్మ, లింగం బయటకు వెళ్తారు.

లింగం అంజమ్మతో యేదో చెబుతాడు.

అంజమ్మ నువ్వు చెప్పినట్లు వింటానని తలూపుతుంది.

లింగం అధికారి కూర్చున్న గదిలోకొస్తాడు.

"అంజమ్మను కంప్లెయింట్ విత్‌డ్రా చేయించుకోనివ్వండి సార్!!" అంటాడు.

"ఎంత?" అన్నట్టుగా చూస్తాడు.

"పది" అన్నట్లుగా పదివేళ్ళను చూపిస్తాడు లింగం.

"నీ భారమేనా?" అన్నట్లుగా సైగచేస్తాడు అధికారి.

"కంప్లెయింట్ విత్‌డ్రా చేసుకుంటున్నట్లు రాయించినవా?" అంటాడు అధికారి.

"ఇగో... రాయించిన"అంటూ ఓ కాగితాన్ని లింగం అధికారి చేతిలో పెడ్తాడు.

"నీ మొగన్ని వదిలిపెడ్తున్నం. వాన్ని వదిలిపెట్టి నిన్ను లోపలేసేదుండె. మా లింగం చెబుతున్నడని వదిలేస్తున్న పో" అంటాడు అధికారి.

మొబైల్ మళ్ళీ మోగుతుంది.

"యేయ్ సుధాకర్! నీకేం పన్లేదా? ఫోన్ చేసి చంపుతున్నవు... నన్ను క్రికెట్ మ్యాచ్ చూడనివ్వవా?"

"చూస్తే చూసినవుగని, మావోన్ని వదిలేసినవా?"

"చూస్తే చూసినవుగని, మావోన్ని కలుస్తనన్నవు గద..."

"నీ రుణం ఉంచుకోనని చెప్పినగద"

"చెప్పుడు గాదు... చేతలు గావాలె"

"ఓ పదిస్తంగని వాన్ని వదిలెయ్"

"పదా? దానిమిస్తున్నవా?"

"వాడు పేదోడు పదితో వదిలెయ్. ఉన్నోడెవడైనా దొరకడా? అప్పుడెక్కువిప్పిస్తాలే"

"మీవోన్ని గెలిపించుకునేటందుకైతే కోట్లు ఖర్చుపెడ్తవుగని మా దగ్గర్నే పొదుపు జేస్తవు" అంటూ అధికారి ఫోన్ పెట్టేసి

"యేమైంది?" అంటూ టీవీకేసి చూస్తాడు.

"పరవాలేదు సార్! మనోళ్ళు గెలుస్తరు" అంటాడు వందిమాగదుల్లో ఒకడైన జగన్.

కాస్సేపట్లోనే లోపలున్న అంజమ్మ భర్త హనుమంతు బయటకొస్తాడు. భార్యను చూస్తాడు.

"గవానితోటి ఎందుకు తిరుగుతున్నవే అన్నందుకు నన్ను జైళ్ళబెట్టి కొట్టిపిస్తవానె దొంగముండా! మల్ల నీ మొఖంజూస్తే తల్లితోటి పాపం జేసినంత ఒట్టు. ఇప్పట్నించి నీ దారి నీది... నా దారి నాది... పో... నా కంటికి కనబడకు" అంటాడు హనుమంతు.

"తప్పయింది లేవయ్య మొగడా! గంత మాటెందుకంటవు... ఇంటికి పోదాం పా!" అంటుంది అంజమ్మ.

"యే రైలు కిందన్నపడి చస్తగని నీతోటి ఇంటికి రాను. అది నా ఇల్లు కాదు. నువ్వు నా పెండ్లానివి గాదు"

"నువ్వు గట్లంటె మన పోరగాండ్ల గతేంకావాలే"

"ఎవ్వని పోరగాండ్లే! గా పోరగాండ్లు నాకు పుట్టలేదని నువ్వే అంటివి గదనే. వాళ్ళను ఎవ్వనితోటి గన్నవో వాని దగ్గరికే పో" అంటూ హనుమంతు బయటకొస్తాడు.

అక్కడున్న వాళ్ళంతా వాళ్ళకేసి "ఇదంతా వీళ్ళకు మామూలే" అన్నట్టుగా చూస్తుంటారు.

హనుమంతు బయటకు రాగానే అతనికి అప్పుడే జీపు దిగి వస్తున్న సుధాకర్ కనిపిస్తాడు.

"యేంరా హనుమంతూ! వదిలిపెట్టింద్రా?" అంటాడు సుధాకర్.

"అయ్యా! వదిలిపెట్టింద్రు" అంటాడు హనుమంతు చేతులు జోడించి.

"వట్టిగనే వదిలిపెట్టింద్రనుకుంటున్నవార... నేను ఫోన్‌జేసి చెప్తే వదిలి పెట్టింద్రు"

"మీరుణం ఈ జన్మలో తీర్చుకోలేను సార్"

"తీర్చుకోలేను గాదు. తీర్చుకోవాలె... ఈ జన్మలోనే తీర్చుకోవాలె... ఇంటికి పోగానే ఓ పదివేలు తయారు చెయ్యి"

"పదివేలా?" నోరు తెరుస్తాడు హనుమంతు.

"అవును పదివేలే. లేకపోతే ఈపాటికి నీమీద చార్జిషీటు దాఖలయ్యేది. నిన్ను జైలుకు పంపెటోళ్ళు"

"గా రంకుముండ నామీద దొంగమాటలు చెప్పినందుకు గింత పనయ్యిందా? నాకో రెండు పాలిచ్చే ఆవులున్నయి... వాటిని అమ్మి గాపైసలు తెచ్చిస్తలేంద్రి"

"గట్లన్నవు బాగుంది" అంటాడు సుధాకర్. హనుమంతు సుధాకర్‌కు దండం పెట్టి అక్కడ్నుంచి వెళ్ళిపోతాడు.

అంజమ్మను లోపలున్న లింగం చూస్తాడు.

లింగం బయటకొచ్చి అంజమ్మను కూడా బయటకు రమ్మంటాడు.

"అంజమ్మా! రేపటోర్కకు ఓ పదివేలు తయారుజెయ్యాలె" అంటాడు లింగం.

"పదివేలా? ఎందుకు?"

"ఇంతకుముందు చెప్పింది అర్థం కాలేదానె. ఫాల్స్ కంప్లైంటిచ్చినవని దొర నీమీద కేసు పెట్టి జైలుకు పంపించేటోడు. నేనే ఆపిన. గా పదివేలు ఎప్పుడిస్తవో చెప్పు"

"వట్టిపుణ్యానికి పదివేలా? ఎక్కడ్నుంచి తెచ్చియ్యమంటవు"

"ఇల్లు కుద్వబెట్టు... లేకపోతే నీకు జీవాలున్నయిగద... వాటిని అమ్ము. రేపటోర్కె పైసలు తయారుచెయ్యకపోతే నువ్వు జైలుకు పోవుడు ఖాయం"

"జైలు పాడుబడ... నేనెందుకు జైలుకు పోత. ఎట్లనన్న జేసి తయారు జేస్తలే"

"గట్లన్నవు బావుంది"

అంజమ్మ లింగాన్ని తిట్టుకుంటూ అక్కడ నుంచి వెళ్ళిపోతుంది.

లింగం అధికారి దగ్గరకొస్తాడు.

అధికారి కాసేపు క్రికెట్ మ్యాచ్ చూస్తూ... కాస్సేపు మొబైల్‌లో మాట్లాడుతూ కాస్సేపు వందిమాగదులతో మాట్లాడుతూ మరో కేసును తీసుకుంటాడు.

ఇద్దరమ్మాయిలు అందంగా, ఆధునికంగా జీన్ ప్యాంట్స్, స్లీవ్‌లెస్ షర్ట్స్ వేసుకొని అధికారి ముందు నిల్చుంటారు.

చాలాసేపటి వరకు అధికారి వాళ్ళను చూడనట్టే నటిస్తాడు. తర్వాత చూసి "వాటీజ్ యువర్ ప్రాబ్లమ్?" అంటాడు.

"మేం కాలేజికెళ్తోంటే నల్గురు బోయ్స్ రోడ్డుమీదనే క్రికెట్ ఆడుతూ క్రికెట్ బాల్‌ను కావాలని మావైపు కొట్టారు. దెబ్బ తగిలి ఇది బాధపడ్తొంటే వాళ్ళేమో వెకిలి నవ్వు నవ్వడం" ఇద్దరిలో కాస్త పొడవుగా ఉన్న అమ్మాయి చెబుతుంది.

"వాళ్ళను పట్టుకొచ్చి మా ముందే తన్నాలె సార్!" అంటుంది. దెబ్బతిన్న కాస్త పొట్టిగా ఉన్న అమ్మాయి.

"తన్నాలో తన్నొద్దో నిర్ణయించాల్సింది మేం. తన్నాలని చెప్పడానికి నువ్వెవరు... బీ ఇన్ యువర్ లిమిట్స్. నిన్నా క్రికెట్ బాల్‌తో వాళ్ళు కొట్టారంటావు. ఎక్కడ కొట్టారు? ఎప్పుడు కొట్టారు? కొట్టిన వాళ్ళ పేర్లేమిటి? దెబ్బ ఎక్కడ తగిలింది? వాళ్ళు నిన్ను కొట్టినప్పుడు ఎవరన్నా చూశారా? చూస్తే ఆ సాక్షుల పేర్లేమిటి? ఈ డీటైల్సన్నీ ఇస్తూ కంప్లైంట్ రాసివ్వండి. మేం ఎంక్వయిరీ చేయిస్తాం" అంటాడు అధికారి.

"వాళ్ళ పేర్లు మాకేం తెలుసు సార్... సాక్షులు కూడా ఎవరూ లేరు. మేం చెబుతున్నాం గదా... వాళ్ళిక్కడికి దగ్గర్లోనే ఉన్నారు. మీవాళ్ళను పంపించి వాళ్ళనిక్కడకు రప్పించి ఎంక్వయిరీ చేయించి నాల్గు తన్నండి. మేం వెళ్ళిపోతాం" అంటుంది పొడగాటి అమ్మాయి.

"వెళ్ళిపోతారా? నా ఈ రాజ్యంలో ప్రవేశించాక వెళ్ళిపోవడం మీరనుకున్నంత సులభం కాదు. మిమ్మల్నెవరో కొట్టారంటున్నారు. ఆ కొట్టిన వాళ్ళెవరో, వాళ్ళ పేర్లేమిటో తెలవదంటున్నారు. సాక్షులెవరూ లేరంటున్నారు. వాళ్ళను పిలిపించి తన్న మంటున్నారు. ఇదేమన్న పిల్లలాట అనుకుంటున్నారా? ఫాల్స్ కంప్లైంటిచ్చినందుకు మొదలు మీమీద యాక్షన్ తీసుకోవాలి. వొళ్ళంతా కనిపించేలా డ్రెస్ చేసుకొని వయ్యారాలు వొలకబోస్తూ రోడ్లమీద తిరుగుతోంటే మొగపోరగాళ్ళు ఊరుకుంటారను కున్నరా? క్రికెట్ బాల్‌తో ఎక్కడ కొట్టాలో అక్కడే కొడ్తరు"

"వాటీజ్‌దిస్? మీరింత ఇర్రెస్పాన్సిబుల్‌గా మాట్లాడుతున్నరు. మా ఇష్టమొచ్చినట్లుగా డ్రెస్ చేసుకునే హక్కు మాకుంది"

"మీ ఇష్టమొచ్చినట్లుగా డ్రెస్ చేసుకొనే హక్కు మీకున్నట్టే వాళ్ళకిష్టమొచ్చి నట్టుగా ఆడుకునే హక్కు వాళ్ళకుంటుంది"

"అయితే వాళ్ళమీద మీరేం యాక్షన్ తీసుకోనంటారు? అంతేనా?"

"యాక్షన్ తీసుకుంటాను. ఎందుకు తీసుకోను. నేను చెప్పినట్టుగా కంప్లైంట్ రాసివ్వండి"

"రాసివ్వం... మేం వెళ్ళిపోతున్నాం" అంటూనే వాళ్ళు వెళ్ళిపోవటానికి ప్రయత్నిస్తారు.

"అట్లెట్ల వెళ్ళిపోతరు? రాత్రి మేం ఓ బ్రోతల్‌హౌస్ మీద రెయిడ్ చేస్తే మీరిద్దరు దొరికారని మీమీద కేసుపెట్టి లోపల పడేస్తా" అంటాడు అధికారి.

"ఆఁ" అంటూ ఆ ఇద్దరమ్మాయిలు నోర్లు తెరుచుకొని అలాగే ఫ్రీజయి పోయినట్లుగా కనిపిస్తారు.

"అమ్మాయిలూ! మీరిద్దరొకసారి నాతో బయటకు రండి" అంటాడు వందిమాగదుల్లో ఒకడైన జగన్"

ఆ ఇద్దరమ్మాయిలు జగన్‌తో బయటకు వెళ్తారు.

"చూడండమ్మాయిలు. మీరీ రాజ్యములో కొచ్చి చాలా తప్పుచేశారు. అతడన్నంత పనిచేస్తాడు. అతన్ని తక్కువ అంచనా వెయ్యకండి. బ్రోతల్‌హౌస్‌లో పట్టుబడ్డారని మీమీద కేసు రిజిష్టర్ చేస్తాడు. మీరిక్కడ్నించి తప్పించుకొని వెళ్ళిపోవడానికొకటే మార్గం" అంటాడు వందిమాగదుడు.

"యేమిటది?"

"అతడి మొఖాన ఓ పది కొట్టండి"

"పదంటే... పది వందలా?"

"కాదు... ఈరోజుల్లో పది వందలకేమొస్తుంది... పదివేలు"

"పదివేలా? మైగాడ్!" అంటుంది పొడవాటి అమ్మాయి.

"పోనీయ్‌లేవే... వాడితో ఎందుకు? మనం వాడి దగ్గరకు రావడమే పొరపాటైంది. ఈరోజే మాడాడీ పాకెట్ మనీ అని పదివేలిచ్చాడు. దీన్ని వాడి మొఖాన కొడదాం!" అంటూనే పర్స్‌లోంచి పది వెయ్యిరూపాయల నోట్లు తీసి జగన్ చేతిలో పెట్టేస్తుంది దెబ్బతిన్న అమ్మాయి.

"థాంక్యూ బేబీస్" అంటూ వందిమాగదుడు అక్కడ్నుంచి వెళ్ళిపోతాడు.

ఆ ఇద్దరమ్మాయిలు కూడా వాళ్ళ బైక్‌మీద కూర్చొని వెళ్ళిపోతారు.

వందిమాగదుడు విజయగర్వంతో అధికారి కూర్చొన్న ప్రసాదంలోకి ప్రవేశించి 'డన్' అన్నట్లుగా అధికారికేసి చూస్తాడు.

అధికారి మొబైల్ ఫోన్లో మాట్లాడుతుంటాడు.

'లంచ్‌కు రావాలా? యేం సర్వ్ చేస్తావు...

జానీ వాకర్ బ్లూలెబెల్ ఉందా? వండర్‌ఫుల్ ఐదారు కేసులున్నాయి. వాటిని సెటిల్ చేసి వస్తా. మూడో, నాల్గో అవుతుంది. ఫరవాలేదు కదా!"

"మీరెప్పుడొచ్చినా మా ఇంటి ద్వారాలు మీకోసం తెరచుకునే ఉంటాయి" అంటాడు అవతలి వ్యక్తి. అధికారి ఫోన్ పెట్టేసి "వరేయ్ చంద్రయ్యా" అంటూ గావుకేక పెడ్తాడు.

"సార్! అంటూ చంద్రయ్య వచ్చి అటెన్షన్‌లో నిల్చుంటాడు.

"ఇక్కడికి దగ్గర్లోనే నల్గురు పోరగాండ్లు క్రికెట్ ఆడుతున్నరట - వాళ్ళను పట్టుకరాపోండ్రి" హుకుం జారీ చేస్తాడు అధికారి.

చంద్రయ్య "అలాగే సార్!" అంటూ బయటకు వెళ్ళిపోతాడు.

అధికారి క్రికెట్ మ్యాచ్ చూస్తూ చాలా ఎక్సటయిపోతాడు.

"టార్గెట్ దగ్గర పడింది. మనవాళ్ళు గెలిచేటట్టే ఉన్నరు. పాకిస్తాన్‌ను ఓడించటమంటే గ్రేటే. వెధవలు ఒక్క పాకిస్తానీ పది మంది భారతీయులకు సమానమని ఫోజు కొడ్తుంటారు. మనం వాళ్ళను ఎన్నిసార్లు వీలైతే అన్నిసార్లు ఓడించాలి" అంటాడు అధికారి పెద్ద దేశభక్తుడిలా మారి.

"అవును సార్!" అంటారు వందిమాగదులు.

అధికారి సెల్‌ఫోన్ మళ్ళీ మోగుతుంది.

"ఎవరు? ధర్మారావా? మీరు నిజంగా ధర్మారావే సార్! చెప్పండ్రి సార్! వాట్ కెన్ ఐ డు ఫర్ యూ" అంటాడు అధికారి.

"నేను చెప్పిన కేసేం చేశారు?"

"ఆ కేసా? గుర్తొచ్చింది. పెండ్లాం మొగుణ్ణి కొట్టిన కేసే కదా... లాభం లేదు ధర్మారావుగారూ! మా చట్టాలన్నీ స్త్రీలకు అనుకూలంగా ఉన్నాయి. పెండ్లాం మొగుడ్ని కొడ్తే మేం పెండ్లాన్ని శిక్షించలేం. అయినా నేను ఎలాగో ఈ కేసును పరిష్కరిస్తాను లేండి. మీరేం వరీ కాకుండ్రి"

"మీరు పరిష్కరించకపోతే ఎవరు పరిష్కరిస్తార్లెండి. పెండ్లాం మొగుళ్ళ కేసుల్ని పరిష్కరించడంలో మీరు ఎక్స్‌పర్ట్స్ కదా... ఆ పెండ్లానికి చాలా పొగరుంది. దాన్ని మీరైతేనే అణచగలరు"

"రేపు దాన్ని పిలిపించి ఆ వ్యవహారాలన్నీ సెటిల్ చేస్తాలెండి" అంటూ అధికారి ఫోన్ కట్ చేస్తాడు.

అధికారి ఫోన్లో మాట్లాడుతున్నప్పుడే చంద్రయ్య నల్గురు కాలేజీ స్టూడెంట్స్‌లా కనిపిస్తున్న యువకుల్ని అతని ముందు హాజరు పరుస్తారు. ఆ నల్గురు జీన్స్ ప్యాంట్స్ వేసుకొని టక్ చేసుకున్నారు. వాళ్ళ వయస్సు 20-25 మధ్య ఉండొచ్చు. వాళ్ళ మొఖాల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తుంది.

అధికారి వాళ్ళకేసి క్రూరంగా చూస్తాడు.

లేచి నిల్చుంటాడు. అతని భారీ విగ్రహాన్ని, అతని చేతిలో అతడు ఝుళిపిస్తున్న లాఠీని చూసి వాళ్ళ గుండెలు దిగజారిపోతాయి.

"యేంరా! మదమెక్కినాదిరా... చదువుకొమ్మని పంపిస్తే క్రికెట్ ఆడ్తార్రా. క్రికెట్‌బాల్‌తో ఆడపిల్లల్ని కొట్టరానిచోట్ల కొడ్తార్రా... ఇప్పుడు నేను కొడ్తారా... నా లాఠీ దెబ్బలు రుచి చూస్తారా?" అంటూ అధికారి ఆ నల్గురి వైపు వాళ్ళను చంపేస్తానన్నట్లుగా కదుల్తాడు.

"వద్దు సార్! మమ్మల్ని కొట్టొద్దు సార్! మేం వాళ్ళని కొట్టాలని కొట్టలేదు సార్! మా శ్రీధర్‌గాడు ఓ బలమైన షాట్ కొడ్తే అది వెళ్ళి ఆమెకు తగిలింది సార్. మేం వెంటనే వాళ్ళకు సారీ చెప్పినం సార్!" అంటాడు వాళ్ళళ్ళో అందరికంటే లావుగా వున్న యువకుడు.

"కావాలని కొట్టలేదా... నేను మాత్రం ఇప్పుడు కావాలనే కొడ్తారా... ఆడపిల్లలంటే అంత అలుసైపోయార్రా... ఆడపిల్లల్ని యేడిపించే మగ పోరగాండ్లను నిర్దాక్షిణ్యంగా శిక్షించమని మాకు పైనుండి ఇన్‌స్ట్రక్షన్స్... మిమ్మల్ని లోపలేసి మావాళ్ళతో

కుమ్మిస్తే తప్ప మీకు బుద్ధిరాదురా..." అంటాడు అధికారి. వాళ్ళపైకి లాఠీని ఝుళిపించబోతూ.

"మీరు కాస్సేపాగండి సార్!" అంటాడు అక్కడ కూర్చున్న వందిమాగదుల్లో ఒకడైన లింగం.

అధికారి ఆగిపోతాడు.

"మీరు నాతో రండి" అంటూ ఆ నల్గుర్ని తనవెంట తీసుకొని లింగం బయటకెళ్తాడు.

"ఇంకా సేపట్లో అతడు మిమ్మల్ని పొట్టుపొట్టుగా కొట్టేస్తాడు. మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికొకటే మార్గం" అంటాడు లింగం.

"అదేమిటో చెప్పండి సార్!" అంటాడు ఆ నల్గురిలో ఒకడు.

"ఓ పది పడెయ్యండ్రి"

"పదంటే... పదివేలా?"

"అవును పదివేలతో బతికి బయటపడ్తారు. లేకపోతే మీ వొంటిమీద పదివేల లాఠీ దెబ్బలు పడ్తాయి"

"వద్దు సార్... వరేయ్ శ్రీధర్ నీ దగ్గరెంతుందిరా... వరేయ్ హరీష్ నీ దగ్గర..."

నల్గురి పర్సుల్లో ఉన్న డబ్బులు తీసి ఒకచోటికి చేర్చి ఎంతయిందో చూస్తారు. తొమ్మిది వేల ఐదొందలు.

"ఇంతే ఉంది సార్!"

ఆ డ్బును అతని చేతికిస్తారు.

"మీరు వెళ్ళండి నేను మేనేజ్ చేస్తా"

"థాంక్యూ సార్!" అంటూ వాళ్ళు వాళ్ళ టూవీలర్స్ దగ్గరికి పరిగెత్తుతారు.

* * *

అధికారి రోజు ఇలా ఎన్నో కేసుల్ని పరిష్కరిస్తూ ఇంటికెళ్ళాక అతని శ్రీమతితో "నేనీరోజు ఇరవై కేసుల్ని పరిష్కరించా"నని గర్వంగా చెప్పి చేతిలో ఉన్న వరాల మూటను ఆమె చేతికిస్తాడు.

"ఇరవయ్యేనా? కనీసం అరవై కేసులన్నా సెటిల్ చేస్తారనుకున్నాను" అంటుంది అతని శ్రీమతి అతడందించిన వరాలమూటను అందుకుంటూ.

'చినుకు' మాసపత్రిక *(వార్షికోత్సవ ప్రత్యేక సంచిక 2009)*